ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 24.09.2026 సమయం:13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. దానం నాగేందర్ ఎమ్మెల్యేగా అనర్హుడని ప్రకటించిన హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ దానం వేసిన పిటిషన్ ను సుప్రీంకోర్టు ఈరోజు డిస్మిస్ చేసింది.

2. బ్యాంక్ యూనియన్ల సమ్మె నేపథ్యంలో, ఈ నెల 27న ఆదివారం అన్ని బ్యాంకులు తెరిచి ఉంటాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

3. హైదరాబాద్ లో వైభవంగా సాగిన గణపతి నవరాత్రోత్సవాల ముగింపు వేడుకలకు రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు విభాగం, భాగ్యనగర గణేష ఉత్సవ సమితి సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేస్తోంది.

4. రాష్ట్రంలో పలుచోట్ల ఈరోజు, రేపు, ఎల్లుండి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది.

-----------------------------

**దానం**

దానం నాగేందర్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసింది. దానం నాగేందర్ ఎమ్మెల్యేగా అనర్హుడని ప్రకటించిన హైకోర్టు తీర్పును సుప్రీం సమర్థించింది. ఒక పార్టీ నుంచి గెలిచి మరో పార్టీ తరఫున పోటీ చేయడాన్ని తప్పుబట్టిన సుప్రీంకోర్టు దానం పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి ఏమీ లేదని, ఘర్‌వాపసీ చట్ట సభలకు వర్తించదని స్పష్టం చేసింది.

**పీటీసీ - హైదరాబాద్**

---------------------------

**రేవంత్**

ఎత్తిపోతల పథకాల పంపులకు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో ఆటంకాలు లేకుండా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. విద్యుత్ శాఖపై ఎంసీఆర్ హెచ్ఆర్డీలో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతూ.. అన్ని థర్మల్ కేంద్రాలు పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తి చేయాలన్నారు. అవసరానికి తగినట్లు విద్యుత్ కొనుగోలు చేయాలని, జెన్‌కోకు సింగరేణి నాణ్యమైన బొగ్గు సరఫరా చేయాలని సూచించారు. సాగుకు కేవలం సోలార్ విద్యుత్తునే సరఫరా చేయాలని కేంద్రం డిస్కంలకు సూచించినట్లు అధికారులు సీఎంకు తెలిపారు.

**డెస్క్**

-----------------------------

**సమ్మిట్**

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 ఏర్పాట్లను ప్రతిష్టాత్మకంగా చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు జరిగే ఈ సదస్సు కోసం సచివాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. దాదాపు 10 ప్రత్యేక అధికారుల కమిటీలు, మంత్రుల నేతృత్వంలో ఎగ్జిక్యూటివ్ కౌన్సిళ్లను ఏర్పాటు చేశారు. దేశ, విదేశాల్లో రోడ్‌షోలు నిర్వహిస్తామని, వార్ రూమ్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తామని తెలిపారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమన్నారు.

**డెస్క్**

--------------------------------

**డోర్ డెలివరీ**

ఇంటి ముంగిటకే పౌర సేవలు అందించే 'మీ సేవా డోర్ డెలివరీ సర్వీసెస్'ను ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు బాగ్ లింగంపల్లిలో ప్రారంభించారు. టోల్ ఫ్రీ నంబర్ 1100 లేదా మీ సేవా పోర్టల్ ద్వారా స్లాట్ బుక్ చేసుకుంటే, జనన, మరణ ధృవీకరణ పత్రాలు, ఆదాయ, కుల,

నివాస సర్టిఫికేట్లు, ఈసీ కాపీలు వంటి సేవలను ఇంటి దగ్గరే అందిస్తారు. తొలి దశలో 'క్యూర్' ప్రాంతాల్లో అమలు చేసి, తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని మంత్రి తెలిపారు.

డెస్క్

------------------------------

**రిమ్స్**

ఆదిలాబాద్ రిమ్స్‌లోని నవజాత శిశు సంరక్షణ విభాగంలో జరిగిన అగ్నిప్రమాదంపై తెలంగాణ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా స్పందించింది. ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, భద్రతా ఏర్పాట్లు, సహాయక చర్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని జస్టిస్ షమీమ్ అక్తర్ నేతృత్వంలోని కమిషన్, వైద్యారోగ్య శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించింది.

డెస్క్

------------------------------------

**బ్యాంకులు**

ఈ నెల 28 నుంచి 30 వరకు బ్యాంక్ యూనియన్ల సమ్మె నేపథ్యంలో, ఖాతాదారుల సౌకర్యార్థం ఈ నెల 27న ఆదివారం అన్ని ప్రభుత్వరంగ బ్యాంకులు, గ్రామీణ బ్యాంకులు తెరిచి ఉంటాయని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. వారాంతపు సెలవులైన 26, 27 తేదీలతో సమ్మె కలిసి రావడంతో, వరుసగా ఐదు రోజుల పాటు బ్యాంకింగ్ సేవలు నిలిచిపోయే అవకాశం ఉందని పేర్కొంది. దీంతో ఆదివారం అన్ని బ్యాంక్ శాఖలు, కరెన్సీ చెస్ట్‌లు పూర్తిస్థాయిలో పనిచేసేందుకు రిజర్వ్ బ్యాంక్ అనుమతి ఇచ్చింది. అత్యవసర బ్యాంకింగ్ సేవలకు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నట్టు మంత్రిత్వ శాఖ తెలిపింది.

డెస్క్

---------------------------

**యాదాద్రి**

యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంటును ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పేందుకే బొగ్గు కొరత పేరుతో విద్యుత్ ఉత్పత్తి నిలిపివేశారని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి ఆరోపించారు. నల్గొండ జిల్లా

దామరచర్లలోని ప్లాంటును మాజీ ఎమ్మెల్యేలతో కలిసి సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, 20 రోజులకు సరిపడ బొగ్గు నిల్వ చేసుకోవాల్సి ఉన్నా ప్రభుత్వం సక్రమంగా దిగుమతి చేసుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్ర అవసరాలు తీర్చే యాదాద్రి ప్లాంటును నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.

**పీటీసీ - నల్గొండ**

-----------------------------

**గణపతి నిమజ్జనం**

హైదరాబాద్ లో వైభవంగా సాగిన గణపతి నవరాత్రోత్సవాల ముగింపు వేడుకలకు సర్వం సన్నద్ధమయ్యింది. రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం, పోలీసు విభాగం, భాగ్యనగర గణేష ఉత్సవ సమితి సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. రేపు జరిగే మహానిమజ్జన శోభాయాత్రతో ఉత్సవాలు పరిసమాప్తి అవుతాయి. బాలాపూర్ గణేష్ నుంచి జరిగే తుది శోభాయాత్రకోసం అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఊరేగింపు సాగే మార్గాల్లో 10 వేల సీసీ కెమెరాలు, 24 డ్రోన్లు, దాదాపు 100 హైరైజ్ కెమెరాలను నిఘా కోసం ఉపయోగిస్తున్నారు. వీటిని బంజారాహిల్స్ కమాండ్ కంట్రోల్ సెంటర్ కు అనుసంధానించి నిమజ్జన వేడుకలను పర్యవేక్షించనున్నారు. శోభాయాత్ర, వినాయక సాగర్ పొడవునా 20 వేల మంది సిబ్బందికి తోడు, 4 ఆర్ఏఎఫ్, 2 సీఆర్పీఎఫ్ కంపెనీలను, 53 బీడీ టీంలను మోహరించారు. ప్రధాన జలాశయాల వద్ద గజ ఈతగాళ్లను, రెస్క్యూ బోట్లను సిద్ధంగా ఉంచారు. 14వేల 929 మండపాలకు అనుమతులు ఇవ్వగా, ఇప్పటివరకు 32వేల 878 విగ్రహాల నిమజ్జనం పూర్తయిందని అధికారులు తెలిపారు. డీజేలు, బాణసంచాపై నిషేధం ఉందని, అసభ్య ప్రవర్తనపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ సజ్జనర్ హెచ్చరించారు.

మరోవైపు.. గణేష్ ఉత్సవాల సందర్భంగా గణపతి మండపాల వద్ద మహిళలు, యువతుల భద్రత కోసం షీ టీమ్స్ విస్తృతంగా మోహరించాయి. సెప్టెంబర్ 14 నుంచి 23 వరకు ఈవ్ టీజింగ్, అభ్యంతరకర ప్రవర్తనకు పాల్పడిన 1,530 మందిని అదుపులోకి తీసుకున్నాయి.

వీరిలో 724 మందికి వెరిఫికేషన్ అనంతరం కౌన్సెలింగ్ ఇచ్చి, హెచ్చరించి వదిలిపెట్టారు. 48 మందికి శిక్ష పడింది. ప్రధాన మండపాలు, రద్దీ ప్రాంతాలు, నిమజ్జన మార్గాల్లో షీ టీమ్స్ నిఘా కొనసాగిస్తున్నాయి.

47వ సామూహిక గణపతి నిమజ్జనం వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు భాగ్యనగర గణేశ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావినూతల శశిధర్ తెలిపారు. సంస్కృతి సంప్రదాయాలను పాటిస్తూ... శాంతి యుతంగా వేడుకలు ముగిసేలా ప్రభుత్వానికి సహకారం అందిస్తున్నామని, నగరంలోని పలు ప్రాంతాల్లో స్వాగత వేదికలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

**బైట్ - డాక్టర్ రావినూతల శశిధర్**

**డెస్క్**

--------------------------------

**పొన్నం**

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా గణేష్ నిమజ్జనం ఊరేగింపు ఘనంగా కొనసాగుతున్నాయి. నిన్న సాయంత్రం నుండి విరామం లేకుండా వర్షం కురుస్తున్నప్పటికి యువత వర్షంలో తడుస్తూ నృత్యాలు చేస్తూ ఊరేగింపు లో పాల్గొంన్నారు. కరీంనగర్ లోని పాతబజారులో చిన్న హనుమాన్ దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన ఒకటో నంబరు గణపతికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ నిన్న సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ ...

**బైట్ - పొన్నం ప్రభాకర్**

**పీటీసీ - కరీంనగర్**

----------------------------

**నిమజ్జనం**

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రేపు జరిగే గణేశ్ నిమజ్జనానికి పోలీసు, మున్సిపల్ యంత్రాంగాలు విస్తృత ఏర్పాట్లు చేశాయి. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి ఆధ్వర్యంలో సుమారు 5 వేల 749 మంది పోలీసు సిబ్బంది, 1,200 మంది ట్రాఫిక్ సిబ్బంది బందోబస్తులో పాల్గొననున్నారు. ప్రధాన ఊరేగింపు మార్గాలు, నిమజ్జన కేంద్రాలను సుమారు 5 వేల సీసీ కెమెరాలు, డ్రోన్లతో పర్యవేక్షించనున్నారు.

**పీటీసీ - మేడ్చల్**

-----------------------------

**స్వచ్ఛతా హీ సేవా**

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా, మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో గణేశ్ నిమజ్జనాల సందర్భంగా పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కార్పొరేషన్ అదనపు కమిషనర్ సి.ఎన్. రఘు ప్రసాద్ తెలిపారు. నిమజ్జన కేంద్రాల వద్ద సేకరించే పూలు, పచ్చ వ్యర్థాలను ఇతర చెత్తతో కలపకుండా ప్రత్యేకంగా సేకరించి, వాటిని సేంద్రియ ఉత్పత్తుల తయారీకి వినియోగించేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు.

**బైట్ - రఘుప్రసాద్**

**పీటీసీ - మేడ్చల్**

------------------------------

**వాతావరణం**

రాష్ట్రంలో పలుచోట్ల ఈరోజు, రేపు, ఎల్లుండి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణశాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది. రెడ్ ఎలర్ట్ జారీ చేసిన జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని విపత్తు నిర్వహణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు.

**పీఎస్**

-------------------------------